

దేవరకద్ర మండలంలోని చిన్నరా జమూర్ ఆంజనేయ స్వామి ఆలయం

# ఆంజనేయా.. దీవించయ్యా..

- నేటి నుంచి చిన్నరాజమూరు బ్రహ్మోత్సవాలు
- 26న స్వామివారి రథోత్సవం
- ఏర్పాట్లు చేసిన నిర్వాహకులు

దేవరకద్ర, డిసెంబర్ 23 : మండలంలోని చిన్నరాజమూర్ గ్రామంలో వెలసిన ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాలు ఈ నెల 24వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. ఆలయాన్ని రంగురంగుల విద్యుద్దీపాలతో నిర్వాహకులు సర్వాంగసుందరంగా ముస్తాబు చేశారు. ఉత్సవాలను తిలకించేందుకు జిల్లాలోని నలుమూలల నుంచే కాకుండా ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర నుంచి భక్తులు వేలాదిగా తరలిరానున్నారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. భక్తులు స్వామి వారికి దాసంగాలు సమర్పించి మొక్కులు తీర్చుకోవడం ఆనవాయితీ.కాగా, ఉత్సవాల సందర్భంగా దేవరకద్ర బస్టాండ్ నుంచి జాతర వరకు ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సు సౌకర్యాన్ని కల్పించారు. ఆలయ ప్రాంగణంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు ఎస్సై వెంకటేశ్‌తెలి పారు.



స్వామివారి మూలవిరాట్

***బ్రహ్మోత్సవాల వివరాలు..***

స్వామి వారి ఉత్సవాలు 24 నుంచి 28 తేదీ వరకు నిర్వహించనున్నారు. తొలిరోజు పంచామృతాభిషేకం, అలంకరణ, హనుమత్ వ్రతం, ధ్వజారోహణం, హోమం, రాత్రికి హంసవాహన సేవ. 25న పంచామృతాభిషేకం, అలంకరణ, మహానైవేద్యం, శ్రీనివాస కల్యాణం, రాత్రికి పల్లకీసేవ. 26న పంచామృతాభిషేకం, అలంకరణ, రాత్రికి అశ్వవాహన సేవ, ప్రభోత్సవం. 27న పౌర్ణమి సందర్భంగా పంచామృతాభిషేకం, మహాలంకరణ, రాత్రికి గజవాహనసేవ, రథోత్సవం. 28న ఉదయం అవభృత స్నానం, పంచామృతాభిషేకం, అలంకరణ, పల్లకీసేవ నిర్వహించనున్నారు.


విన్నర్‌గా నిలిచినఉ మ్మడి మహబూబ్‌నగర్‌జ ట్టు



# రాష్ట్రస్థాయి కబడ్డీ విజేత పాలమూరు

- జాతీయ స్థాయి పోటీలకు కందనూలు క్రీడాకారుడు నందకిశోర్ ఎంపిక

నాగర్‌కర్నూల్, డిసెంబర్ 23 : 67వ స్కూల్ గేమ్ ఫెడరేషన్ రాష్ట్రస్థాయి అండర్-17వ బాలుర కబడ్డీ పోటీల్లో ఉమ్మడి మహబూబ్‌నగర్ జట్టు విజేతగా నిలిచింది. హనుమకొండలో నిర్వహించిన టోర్నీ ఫైనల్‌లో నల్లగొండ జట్టుతో తలపడింది. హోరాహోరీగా సాగిన మ్యాచ్‌లో నాగర్‌కర్నూల్ జిల్లా క్రీడాకారుడు నందకిశోర్ జట్టు విజయంలో కీలకంగా వ్యవహరించారు. కామారెడ్డి జిల్లాలో జనవరిలో జరిగే స్కూల్ గేమ్స్ జాతీయస్థాయి నేషనల్ స్థాయి కబడ్డీ టోర్నమెంట్‌కు ఎంపికయ్యాడని నాగర్‌కర్నూల్ జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి పాండు తెలిపారు. ఈ సందర్భంగా డీఈవో గోవిందరాజులు, పాండు, జిల్లా ఎస్‌పీసీ సెక్రటరీ ప్రసాద్‌గౌడ్ , జిల్లా సైన్స్ అధికారి కృష్ణారెడ్డి హర్షం వ్యక్తం చేస్తూ క్రీడాకారుడిని అభినందించారు. నైపుణ్యం గల క్రీడాకారులను తయారు చేసిన పీఈటీ, కోచ్ మేనేజర్లందరినీ జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ తరపున అభినందించారు. క్రీడాకారుడు నందకిశోర్ లింగాలలోని ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్నాడు.




త్రిపుల్ రైడింగ్ చేశారా..? కారు సీటు బెల్ట్ ధరించలేదా..? ట్రాఫిక్ పోలీస్ కెమెరా కంటికి చిక్కారా..?

..బాబోయ్ వేలకు వేలు ఎలా చలానాలు కట్టాలా.. అని ఆలోచించాల్సిన పరిస్థితి లేదు. ఇలాంటి వాహనదారుల కష్టాలను తీర్చేందుకు రాష్ట్ర పోలీస్ శాఖ నిర్ణయించింది. ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘునకుగానూ పెండింగ్ చలానాలు సులువుగా చెల్లించేలా భారీ డిస్కౌంట్ ప్రకటించింది. ద్విచక్ర వాహనాలకు 80 శాతం, ఆటోలు, ఫోర్ వీలర్లకు 60 శాతం, ఆర్టీసీ బస్సులు, తోపుడు బండ్లకు 90 శాతం రాయితీ ఇచ్చింది. భారీ వాహనాలపై 50% రాయితీ ప్రకటించింది. 26వ తేదీ నుంచి జనవరి 10వ తేదీ వరకు చెల్లింపులు చేసుకోవాలని సూచించింది. దీంతో వాహనదారుల్లో సంతోషం వ్యక్తమవుతున్నది.

*- నాగర్‌కర్నూల్, డిసెంబర్ 23 (నమస్తే తెలంగాణ)*





- వాహన చలానాపై భారీ డిస్కౌంట్
- 26 నుంచి జనవరి 10 వరకు అవకాశం
- మీ సేవ కేంద్రాలు, ఆన్‌లైన్‌లో చెల్లింపులు
- భారీ రాయితీ ప్రకటించిన పోలీస్‌శాఖ
- చెల్లింపులపై అవగాహన కల్పించేలా..

# లక్కీ ఛాన్స్!

ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘునలతో పోలీసులకు చిక్కిన వాహనదారులకు చలానా చెల్లింపులను సులభతరం చేసింది. బైకులు, కార్లు, ఆటోలు, ఇతర భారీ వాహనాలపై పడిన చలానాలను భారీ డిస్కౌంట్‌తో చెల్లించేందుకు రవాణా శాఖ అవకాశం కల్పించింది. ఈనెల 26నుంచి జనవరి 10వ తేదీ వరకు చలానాలు చెల్లించవచ్చు. చాలా మంది వాహనదారులు ట్రాఫిక్ సిగ్నళ్లను పాటించకపోవడం, నో పార్కింగ్ ప్లేస్‌లో వాహనం నిలపడం, లైసెన్సు లేకుండా డ్రైవింగ్ చేయడం, మద్యంతాగి డ్రైవింగ్ చేయడం, ఆర్సీ, బీమాలాంటి పత్రాలు కలిగి ఉండకపోవడం, మైనర్లు నడపడం, అతివేగం లాంటి కారణాలతో ట్రాఫిక్ పోలీసులకు పట్టుబడ్డారు. రోడ్లపై ఇష్టారాజ్యంగా వాహనాలను నడపకుండా, నిలుపకుండా, డ్రైవింగ్‌తో ఇతరులకు ఇబ్బందులు కలుగకుండా పోలీసు, ట్రాఫిక్ పోలీసులు పట్టణాలు, గ్రామాల్లోనూ కూడళ్ల వద్ద, శివార్లలో గస్తీ నిర్వహిస్తూ వస్తున్నారు. ఒక్క వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘిస్తే అతడితో పాటుగా వాహనంలో ఉన్న, సంబంధం లేని ఇతర వాహనదారులు, ప్రజలు కూడా బాధితులుగా మారుతున్నారు. చాలా మంది క్షతగాత్రులు కావడంతో పాటుగా మృత్యువాత సైతం పడుతున్నారు. వాహనదారులు ఈ బాధ్యతలను గుర్తించడం కోసమే పోలీసు శాఖ చలానాలు విధిస్తోంది. అయినా చాలా మంది బాధ్యతారాహిత్యంగా వాహనాలు నడుపుతూ పోలీసుల కెమెరా కంటికి చిక్కుతున్నారు. దీంతో వాహనదారులు తమ వాహనాలతో రోడ్లపైకి వచ్చేటప్పుడు పాత జరిమానాలకు భయపడుతూ వస్తున్నారు. పాత చలానాలు చెల్లించకపోగా కొత్తగా పడే చలానాలతో వాహనదారులు బెంబేలెత్తుతున్నారు. ఇలా గత ఏడాది నుంచి పెద్ద ఎత్తున వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించినట్లు పోలీసులు గుర్తించారు. ఇందులో అధికశాతం ద్విచక్ర వాహనదారులే ఉన్నట్లుగా అంచనా. గతంలో కేసీఆర్ సర్కారు ఈ పెండింగ్ చలానాలపై రాయితీ ప్రకటించింది. దీంతో నెలన్నరలో రూ.300 కోట్ల మేర చలానాలు వసూలవ్వడం గమనార్హం. గతంలో బైక్‌లపై 75శాతం, ఇతర వాహనాలకు 50శాతం రాయితీ ఇవ్వగా ఈసారి డిస్కౌంట్‌ను మరింత పెంచడం గమనార్హం. ఆర్టీసీ బస్సులు, తోపుడు బండ్లపై 90శాతం, బైకులపై 80శాతం, ఆటోలు, కార్లపై 60శాతం, భారీ వాహనాలపై 50శాతం మేర డిస్కౌంట్ ఇస్తూ చలానాలు చెల్లించేలా నిర్ణయించింది. దీని ప్రకారం చూస్తే.. ఒక బైక్‌కు రూ.1000 చలా నా ఉంటే రూ.200వరకు చెల్లించాల్సి ఉంటుంది. ఇక ఆటోలు, కార్లపై 60 శాతం రాయితీ ఉండగా ఒక్క వాహనానికి రూ.1000వరకు చలానా ఉంటే రూ.400, భారీ వాహనాలకు రూ.1000 ఉంటే రూ.500మాత్రమే చెల్లించాల్సి ఉంటుంది. బైక్‌లపై రూ.3వేలు పెండింగ్ చలానా ఉంటే రూ.600, ఫోర్ వీర్లపై రూ.3వేలు ఉంటే రూ.1200 వరకు మాత్రమే చెల్లించాల్సి వస్తుంది. తమ వాహనాలపై ఉన్న పెండింగ్ చలానాలను ఈనెల 26వ తేదీ నుంచి జనవరి 10వ తేదీ వరకు మీ సేవా కేంద్రాలతోపాటు ఆన్‌లైన్ లోనూ చెల్లించే అవకాశం ఉంది. రవాణా శాఖ వద్ద నమోదైన గణాంకాల ప్రకారం నాగర్‌కర్నూల్ జిల్లాలో 10వేల కార్లు, 70వేల బైకులు, 6వేల ఆటోలు, 5వేలు భారీ వాహనాలు ఉన్నాయి. ఇందులో చలానాలు పడిన వాహనదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా పోలీసు శాఖ సూచిస్తోంది.

***నిబంధనల మేరకు చలానా చెల్లింపులు***

ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘునలపై నిర్దేశించిన రాయితీ మేరకు చలానాలు చెల్లించాలి. వాహనదారులు ఈనెల 26వ తేదీ నుంచి ఆన్‌లైన్, మీ సేవ కేంద్రాల ద్వారా చలానాలు కట్టాలి. ఆ తర్వాత ఈ అవకాశం ఉండదు. ఎక్కడైనా మళ్లీ పట్టుబడితే రెట్టింపు చలానాలు పడే అవకాశం ఉంటుంది. నెంబర్ ప్లేట్లు లేని వాహనదారులు తప్పకుండా వాహనాలపై నెంబర్లు రాయించుకోవాలి. దీనిపై జిల్లాలో ప్రత్యేకంగా దృష్టి సారించాం.

*- గైక్వాడ్ వైభవ్ రఘునాథ్, ఎస్పీ, నాగర్‌కర్నూల్ జిల్లా*



***ఉమ్మడి జిల్లాలో పెండింగ్ చలాన్ల వివరాలు..***

- నారాయణపేట జిల్లాలో ఇప్పటివరకు పెండింగ్ చలాన్లు 1,80,632 ఉండగా.. వీటిపై రూ.9,28,62,375 జరిమానా ఉన్నది.
- జోగుళాంబ గద్వాల జిల్లాలో 76,555 చలాన్లు ఉండగా.. వీటిపై రూ.5,50,55,270 ఫైన్ ఉన్నది.
- వనపర్తి జిల్లాలో 2,58,207 చలాన్లు ఉండగా.. వీటిపై రూ.15,41,55,245 ఫైన్ ఉన్నది.
- మహబూబ్‌నగర్ జిల్లాలో 1,99,841 చలాన్లు ఉండగా.. వీటిపై రూ.9,36,67,245 ఫైన్ ఉన్నది.
- నాగర్‌కర్నూల్ జిల్లాలో ఇప్పటివరకు పెండింగ్ చలాన్లు 2,18,958 ఉండగా.. వీటిపై రూ.10,09,75,785 జరిమానా ఉన్నది.

# జాబ్ కోసం పోయి.. జాడలేకుండ పాయే

- కూతురుకు ఉద్యోగం కావాలని ప్రజాదర్బార్‌కు వెళ్లిన తల్లిదండ్రులు
- పదిరోజులుగా ఆచూకీ లేకపాయే..
- ఆందోళనలో కుటుంబ సభ్యులు
- ఉద్యోగం లేకపోయినా ఇంటికి రావాలని కూతురు నీలమ్మ కన్నీరు

మద్దూర్ (కొత్తపల్లి), డిసెంబర్ 23 : ఉద్యోగం లేకపోయినా ఫర్వాలేదు ఇంటికి రా అమ్మా అంటూ ఓ నిరుద్యోగ యువతి ఆవేదన చెందుతున్నది. మద్దూరు మండల కేంద్రానికి చెందిన వెంకటయ్య, బసమ్మ దంపతులకు ఏడుగురు ఆడపిల్లలు, ఒక కుమారుడు ఉన్నారు. వెంకటయ్య తాసీల్దార్ కార్యాలయంలో అటెండర్‌గా పనిచేసి రిటైర్డ్ అయ్యాడు. కుటుంబాన్ని పోషించుకోవడం కష్టంగా మారడంతో ఏఎన్ఎం చదివిన తమ కూతురు నీలమ్మకు ఏదైనా ఉద్యోగం ఇప్పిస్తే కుటుంబానికి బాసటగా ఉంటుందని పది రోజుల కిందట కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజాదర్బార్‌కు బసమ్మతో కలిసి వెళ్లాడు. వెంకటయ్య దరఖాస్తు చేసేందుకు బసమ్మను బయటే ఉంచి కార్యాలయానికి ఒక్కడే వెళ్లాడు. తిరిగి వచ్చి చూసే సరికి బసమ్మ ఆ చూకీ లభించలేదు. ఎంత వెతికినా కనిపించకపోవడంతో పంజాగుట్ట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. నేటికీ ఆమె జాడే తెలియరాలేదు. కాగా, ఇంటి వద్ద కూతురు నీలమ్మ ఆందోళనతో ఎదురుచూస్తున్నది. వెంకటయ్య హైదరాబాద్‌లో వెతుకుతూనే ఉన్నాడు. పది రోజులైనా ఆమె ఆచూకీ లభించకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. ఉద్యోగం లేకపోయినా ఫర్వాలేదు.. ఇంటికి రావాలని నీలిమ కంటతడిపెడుతున్నది.



క్రైస్తవులకుదుస్తులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే విజయుడు

## పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలి

- అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు

అయిజ, డిసెంబర్ 23 : క్రైసవులు క్రిస్మస్ పండుగను పేద, ధనిక తారతమ్యం లేకుండా ప్రశాంతంగా నిర్వహించుకోవాలని అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు సూచించారు. శనివారం పట్టణంలో నిర్వహించిన కార్యక్రమంలో క్రైస్తవులకు ప్రభుత్వం సరఫరా చేసిన దుస్తులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. క్రిస్మస్ పండుగ పర్వదినం ప్రాధాన్యతను గుర్తించి సర్కారు పేద కుటుంబాలకు దుస్తులను అందజేస్తుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ దేవన్న, పాస్టర్లు, క్రైస్తవులు,ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.







మన్యంకొండలో బారులుదీరిన భక్తులు, కురుమూర్తిలో స్వామిద ర్శనానికిక్యూలో నిల్చున్న ప్రజలు, శ్రీరంగాపురంలో ఉత్తర ద్వార దర్శనం చేసుకుంటున్న భక్తులు

# ఉత్తర ద్వారం.. ముక్తికి మార్గం

- ముక్కోటి ఏకాదశికి ఆలయాల్లో బారులుదీరిన భక్తులు
- ఉత్తర ద్వార దర్శనంతో పునీతులైన ప్రజలు

దేవరకద్రరూరల్(చిన్న చింతకుంట), డిసెంబర్ 23 : ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం భక్తులు స్నానాలు ఆచరించి ఆలయాలకు బారులుదీరారు. చిన్నచింతకుంట మండలంలోని అమ్మాపూర్ గ్రామ సమీపంలో ఉన్న సప్తగిరులలోని కాంచనగుహలో కొలువు తీరిన వేంకటేశ్వర స్వామి ప్రతిరూపమైన శ్రీకురుమూర్తి స్వామి ఆలయ ప్రాంగణమంతా పూలతో అలంకరించారు. అర్చకులు స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. భక్తులు ఉత్తర ద్వారం ద్వారా దర్శనం చేసుకొని పునీతులయ్యారు. ఆలయ ప్రాంగణం భక్తుల సందడితో నిండిపోయింది. అలాగే కౌకుంట్ల మండల కేంద్రంలోని చెన్నకేశవ స్వామి ఆలయంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీలక్ష్మీచెన్నకేశవ స్వామికి అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. పట్టణ భక్తులు భక్తిశ్రద్ధలతో ఆలయ ప్రదక్షిణలు చేసి స్వామిని ఉత్తర ద్వారం నుంచి దర్శనం చేసుకున్నారు.

***పోటెత్తిన భక్తులు..***

శ్రీరంగాపురం, డిసెంబర్ 23 : మండల కేంద్రంలోని రంగనాథ స్వామి ఆలయంలో శనివారం వైకుంఠ ఏకాదశి వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఉత్తర ద్వారం ద్వారా రంగనాథ స్వామిని దర్శించుకోవడానికి భక్తులు తెల్లవారుజాము నుంచే పోటెత్తారు. ఎమ్మెల్యే మేఘారెడ్డి దంపతులు రంగనాథ స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

***మార్మోగిన గోవింద నామస్మరణ..***

పాలమూరు, డిసెంబర్ 23 : వైకుంఠ ఏకాదశి సందర్భంగా మహబూబ్‌నగర్ రూరల్ మండలం మన్యంకొండ లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. కోనేరు నుంచి గర్భాలయం వరకు క్యూలైన్లలో బారులుదీరి గోవింద నామస్మరణతో స్వామివారిని కొలిచారు. ఉదయం స్వామివారికి సుప్రభాతసేవ, అభిషేకం, ప్రత్యేక అలంకరణ పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. అలాగే లక్ష్మీవేంకటేశ్వరస్వామిని హైదరాబాద్ హైకోర్టు జడ్జి సీవీ భాస్కర్‌రెడ్డి దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త మధుసూదన్‌కుమార్, ఈవో శ్రీనివాసరాజు, పర్యవేక్షకులు నిత్యానందచారి, అర్చకులు ఉన్నారు.



మహబూబ్‌నగర్‌లో వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద భక్తుల సందడి



## హాకీ టోర్నమెంట్‌కు తరలిన విద్యార్థులు



క్రీడాకారులతోరి జిస్ట్రార్‌గి రిజామంగతాయారు

పాలమూరు, డిసెంబర్ 23 : సౌత్‌జోన్ యూనివర్సిటీ ఆలిండియా హాకీ పోటీలకు పాలమూరు విశ్వవిద్యాలయ క్రీడాకారులు బయలుదేరినట్లు పీడీ శ్రీనివాసులు శనివారం తెలిపారు. ఈనెల 24 నుంచి 30 వరకు తమిళనాడులో నిర్వహించనున్న పోటీల్లో పాల్గొంటారన్నారు. పీయూ వీసీ లక్ష్మీకాంత్‌రాథోడ్, రిజిస్ట్రార్ గిరిజామంగతాయారు క్రీడాకారులకు ట్రాక్‌సూట్, యూనిఫామ్స్ అందజేశారు. ఆర్చరీ విభాగంలో పీయూ విద్యార్థి ఎన్.విష్ణువర్ధన్ ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ టోర్నమెంట్‌కు ఎంపికైనట్లు తెలిపారు.


నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

**LAND for SALE**
అచ్చంపేట నుండి నాగర్‌కర్నూల్ వెళ్ళేహైవే రోడ్‌కి జింగుంట గ్రామం, కమర్షియల్ ల్యాండ్
3ఎకరాల 38గుంటల భూమి అమ్మబడును
సెంట్రల్ గవర్నమెంట్ అప్రూవ్ చేసిన హైదరాబాద్ చెన్నైవయా నంద్యాల, తిరుపతి మీదుగా వెళ్ళే 4 లైన్ నేషనల్ హైవేకి దగ్గరలో ఈ భూములు కలవు.
6281076256

**EMI PLOTS**
★EMI Plots in Jadcherla MUDA Approved Layout. గజం: 8,000/- రూ.లకే, 100 పడకల ప్రభుత్వ హాస్పిటల్‌కి అతి చేరువలో, నెలసరి వాయిదా పద్ధతిలో 10,000/- రూ.లకే ప్లాట్లు పొందవచ్చు. స్పాట్ రిజి॥. 7780483434.
NT-314492

**PLOT FOR SALE**
★మహబూబ్‌నగర్ to నాగర్‌కర్నూల్ హైవే ఫేసింగ్ 300 ఎకరాల డిటిసిపి అప్రూవల్ లేఔట్‌లో 99 నెలల EMI ఫెసిలిటీ కలదు. Marketing Executives కావలెను. Cont: 9133399095
NT-320376

**WANTED**
★త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం, జీతం: 18K. Ph: 9160900024/9640400073.
NT-314383-All

**ప్రకటన**
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

To Book your Classified
4 lines Advt
Rs. 200/- Only (B/W)
Additional Line
50/- Only
For Advertisement Enquiry
Please Contact...
9182777641
9182777654
9182777794